క్లుప్తంగా

పేదలకు దుప్పట్ల పంపిణీ

ఏలేశ్వరం: పట్టణంలో పేదలకు శనివారం దుప్పట్లు పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ నేత, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ సామంతుల సూర్యకుమార్ జన్మదినాన్ని పురస్కరించుకుని తన భార్య, మున్సిపల్ కౌన్సిలర్ సామంతుల హైమావతి స్థానిక 12 వార్డులో సుమారు 50 మంది పేదలకు దుప్పట్లు అందజేశారు. తొలుత సూర్యకుమార్ కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ పైల విజయ్‌కుమార్, ఎంపీటీసీ సభ్యుడు యిజనగిరి శివ ప్రసాద్, పతివాడ జగదీష్, అరవాల నాగరాజు, దాసరి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలు అడ్డుకోవాలంటూ ధర్నా

ఏలేశ్వరం: మండలంలోని పరిమితడకలో ఆక్రమణలను అడ్డుకోవాలని కోరుతూ పట్టణంలో శనివారం ధర్నా చేశారు. సీపీఐ (ఎంఎల్) వినోద్ మిశ్రా పార్టీ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి కొశిరెడ్డి గణేష్ మాట్లాడుతూ పరిమితడకలో రామాలయం నిర్మించేందుకు కేటాయించిన స్థలాన్ని ఆక్రమించేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారన్నారు. దీనిపై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. తక్షణమే అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నేతలు సాబే కొమ్మయ్య, సోమాల కుశల, నానిశెట్టి పెదసత్తిబాబు, కోనాల సత్తిబాబు మాడెం బాబీ తదితరులు పాల్గొన్నారు.

టి.రాయవరంలో బీజేపీ ప్రజాపోరుయాత్ర

ప్రత్తిపాడు: మండలంలోని టి.రాయవరంలో శనివారం బీజేపీ నాయకులు ప్రజాపోరుయాత్ర కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు కందా వీరస్వామి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు గ్రామంలో ఇంటింటికీ వెళ్లి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తోన్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి పథంలో దూసుకుపోతోందన్నారు. పార్టీ నాయకులు దేవర రామకృష్ణ యాదవ్, రాజబాబు, చింతాకుల రామకృష్ణ, మడికి కృష్ణ, జిల్లా బీజేపీ ఎస్సీ సెల్ కార్యదర్శి అబ్బిరెడ్డి నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో ప్రజారోగ్యం మెరుగు

గోకవరం: ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో ప్రజారోగ్యం మెరుగుపడుతుందని ప్రకృతి వ్యవసాయ డీపీఎం తాతారావు అన్నారు. మండలంలోని వీరలంకపల్లిలో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల విక్రయ కేంద్రాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రసాయనాలతో పండించిన ఆహార పదార్థాలను తినడం ద్వారా ప్రజారోగ్యానికి హాని కలుగుతుందన్నారు. ఈ విక్రయ కేంద్రంలో వివిధ జిల్లాల్లో సేకరించిన ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను అందుబాటులో ఉంచామని తెలిపారు. ఆదర్శ రైతు కొరిపల్లి అప్పలస్వామి, సిబ్బంది నరసింగరావు, వరలక్ష్మి, మౌనిక, ప్రశాంత్ పాల్గొన్నారు.

ఘనంగా సత్యదేవుని నిత్యకల్యాణం



స్వామివారి కల్యాణం జరిపిస్తున్న పండితులు

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుని నిత్యకల్యాణ మండపంలో స్వామి, అమ్మవార్ల నిత్య కల్యాణం శనివారం వైభవంగా జరిగింది. మాఘపౌర్ణమి, సత్యదేవుని జన్మనక్షత్రం 'మఖ'ను పురస్కరించుకుని పెద్ద సంఖ్యలో భక్తులు కల్యాణంలో పాల్గొన్నారు. గత వారం రోజులుగా రత్నగిరిపై, పలు ప్రాంతాలలో వివాహాలు జోరుగా జరుగుతున్న విషయం తెలిసిందే. కాగా స్వామి, అమ్మవార్ల కల్యాణంలో నవదంపతులు అధికంగా పాల్గొన్నారు. కల్యాణ మండపం నవదంపతులు, వారి బంధుమిత్రులతో నిండిపోయింది. పండితులు ఉదయం 9 గంటలకు సత్యదేవుడు, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను ఊరేగింపుగా నిత్య కల్యాణ మండపానికి తీసుకువచ్చారు. అక్కడ కల్యాణ వేదిక మీద ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కల్యాణబ్రహ్మ నాగాభట్ల కామేశ్వరశర్మ, పురోహితులు కొంపెల్ల మూర్తి, పాలంకి పట్టాభి, గంగాధరబట్ల శ్రీనివాస్ తదితరులు శాస్త్రోక్తంగా స్వామివారి కల్యాణం నిర్వహించారు. 78 జంటలు ప్రత్యక్షంగానూ, మరో ఆరుగురు ఆన్‌లైన్‌లో టిక్కెట్లు కొనుగోలు చేసి పరోక్షంగానూ స్వామివారి కల్యాణంలో పాల్గొన్నారు. స్వామివారి కల్యాణాన్ని యూట్యూబ్‌లో ప్రత్యక్ష ప్రసారం చేశారు.

నేడు అంబేడ్కర్ కాంస్య విగ్రహావిష్కరణ

తుని: స్థానిక సినిమా రోడ్డు జంక్షన్‌లో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కాంస్య విగ్రహాన్ని ఆదివారం రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా ఆవిష్కరించనున్నట్టు అంబేడ్కర్ యూత్ కమిటీ సభ్యులు శనివారం తెలిపారు. ఈ విగ్రహం ఏర్పాటుకు అవసరమైన నిధులను మంత్రి రాజా విరాళంగా అందజేశారన్నారు. ఆదివారం సాయంత్రం జరిగే కార్యక్రమంలో తుని పరిసర ప్రాంతాలకు చెందిన ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.



పి.నాయకంపల్లిలో చండీ హోమం నిర్వహిస్తున్న పురోహితులు



దానవాయిపేట తీరంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేస్తున్న పండితులు



వనదుర్గ అమ్మవారికి హోమం నిర్వహిస్తున్న పండితులు



ఏలేశ్వరంలో పారాయణ చేస్తున్న మహిళలు

సాగరతీరం.. భక్తజన హారం

- భక్తిశ్రద్ధలతో మాఘపౌర్ణమి వేడుకలు
- బీచ్‌లో పుణ్యస్నానాలకు పోటెత్తిన భక్తులు
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు

తొండంగి: మాఘపౌర్ణమిని పురస్కరించుకుని శనివారం పుణ్యస్నానాలు ఆచరించేందుకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో మండలంలోని సాగర తీరాలు జనసంద్రమయ్యాయి. మెట్ట ప్రాంతాలైన శంఖవరం, ఏలేశ్వరం, ప్రత్తిపాడు, రౌతులపూడి, తుని మండలాలతో పాటు తొండంగి మండలానికి చెందిన వేలాది మంది సముద్ర తీరాల్లో పుణ్యస్నానాలు ఆచరించారు. గంగమ్మతల్లికి పసుపు, కుంకుమ సమర్పించి పూజలు చేశారు. మండలంలోని దానవాయిపేట అద్దరిపేట, పంపాదిపేట, యర్రయ్యపేట, జీఎంపేట, తాటియాకుల పాలెం, వాకదారిపేట, పెరుమాళ్లపురం, కొత్తచోడిపల్లిపేట సముద్రతీరాలు భక్తులతో కిటకిటలాడాయి. స్వచ్ఛంద సేవాసంస్థల సభ్యులు భక్తులకు పులిహోర, మజ్జిగ పంపిణీ చేశారు. తీరప్రాంతాల్లో ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎస్సై వినయ్‌ప్రతాప్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.



దానవాయిపేట సముద్ర తీరంలో పుణ్యస్నానాలు చేస్తున్న భక్తులు

ఘనంగా పారాయణ పఠనం

ఏలేశ్వరం: మాఘ పౌర్ణమిని పురస్కరించుకుని పట్టణంలో మహిళలు శనివారం పారాయణ పఠనం చేశారు. విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో స్థానిక సత్యనారాయణస్వామి ఆలయంలో విష్ణుసహస్ర నామ పారాయణ, లలితా సహస్ర నామ పారాయణ, భక్తిగీతాలు ఆలపించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. విశ్వ హిందూ పరిషత్ మండల కార్యదర్శి కటకం కిరీటీ, పరిషత్ ప్రతినిధులు అలమండ దుర్గావెంకటప్రసాద్, తూమురౌతు గురయ్య, ఉడతల రమణారావు, మహిళలు పాల్గొన్నారు.

వనదుర్గ అమ్మవారికి ప్రత్యంగిర హోమం

అన్నవరం: మాఘ పౌర్ణమిని పురస్కరించుకుని రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి శనివారం ప్రత్యంగిర హోమం నిర్వహించారు. పండితులు ఉదయం తొమ్మిది గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమగుండంలో హోమద్రవ్యాలను సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. అర్చకుడు ప్రయాగ రాంబాబు, ఫణిశర్మ, చెల్లపిళ్ల ప్రసాద్, కూచుమంచి ప్రసాద్ తదితరులు హోమం జరిపారు. మొత్తం 60 మంది భక్తులు రూ.750 చొప్పున టిక్కెట్లు కొనుగోలు చేసి హోమంలో పాల్గొన్నారు.

ఘనంగా చండీయాగం

గండేపల్లి: మండలంలోని పి.నాయకంపల్లిలో శనివారం చండీయాగం, లక్ష్మీ, సరస్వతీ హోమాలు వైభవంగా నిర్వహించారు. మాఘ పౌర్ణమిని పురస్కరించుకుని తత్వం చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ శ్రీనివాస బంగారయ్య శర్మ ఆధ్వర్యంలో పొత్తూరు భవాని శంకరశర్మ, సిద్ధార్థశర్మ, పండితులు ఈ యాగాలు నిర్వహించారు. కొండూరి పద్మావతి ఆధ్వర్యంలో మహిళలు సౌందర్యలహరి పారాయణ చేశారు. కార్యక్రమంలో మిట్టల కిరణ్మయి, ప్రముఖ ప్రవచనకర్త అనంతలక్ష్మి, తెలంగాణ రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యురాలు కె.గీతామూర్తి, ట్రస్ట్ సభ్యులు ప్రభాకర్, చైత్ర, అమ్మాజీ, ప్రముఖ పారిశ్రామిక వేత్త చైతన్యరాజు దంపతులు పాల్గొన్నారు.

విశ్వేశ్వరస్వామికి త్రిశూలస్నానం

తొండంగి: మండలంలోని ఒంటిమామిడి విశ్వేశ్వరస్వామికి దానవాయిపేట సాగర తీరంలో శనివారం పండితులు త్రిశూలస్నానం చేశారు. మాఘపౌర్ణమిని పురస్కరించుకుని తెల్లవారుజామున రెండు గంటలకు ఒంటిమామిడి విశ్వేశ్వరుని ఆలయం వద్ద రథోత్సవం నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు పల్లకీపై ఊరేగింపుగా స్వామి, అమ్మవార్లను దానవాయిపేట తీరానికి తీసుకెళ్లారు. సాగర తీరంలో విశ్వేశ్వరస్వామి, రాజేశ్వరి అమ్మవార్ల ఉత్సవ మూర్తులకు త్రిశూలస్నానం చేయించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

రబీకి పూర్తి స్థాయిలో నీరు అందించాలి

- రోడ్లు,భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా

తుని: తొండంగి మండలంలో రైతులు సాగు చేసిన రబీ పంటలకు పూర్తిస్థాయిలో సాగునీరు సరఫరా చేయాలని ఇరిగేషన్ అధికారులను రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా ఆదేశించారు. తుని మండలం ఎస్.అన్నవరంలోని క్యాంపు కార్యాలయంలో శనివారం సాయంత్రం ఇరిగేషన్ అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. తొండంగి మండలంలో రైతులు సాగు చేసిన రబీ వరి పంట చేతికి వచ్చే వరకు పంపా, పీబీసీ కెనాల్ ద్వారా నీటిని అందించాలని సూచించారు. రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. అధికారుల లెక్కల ప్రకారం ఆరు వేల ఎకరాల్లో రైతులు రబీ వరిసాగు చేశారన్నారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. అన్నదాతలకు పెట్టుబడి సాయంతో పాటు రైతు భరోసా కేంద్రాల ద్వారా విత్తనాలు, ఎరువులు, క్రాప్ ఇన్సూరెన్స్ తదితర సదుపాయాలను కల్పిస్తుందన్నారు. రైతులు సంతోషంగా ఉండాలంటే పంట పూర్తి స్థాయిలో చేతికి అందిరావాలన్నారు. ఇందుకు ఇరిగేషన్ అధికారులు సహకరించాలని కోరారు. ఇరిగేషన్ ఎస్ఈ, డీఈఈలు, ఏఈ పాల్గొన్నారు.



తుని క్యాంపు కార్యాలయంలో ఇరిగేషన్ అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి దాడిశెట్టి రాజా

సీఎం జగన్‌కే ప్రజల మద్దతు



భద్రవరంలో పార్టీ పతాకాన్ని ఆవిష్కరించిన కో ఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు
- భద్రవరంలో గడపగడపకూ మన ప్రభుత్వం

ఏలేశ్వరం: రాష్ట్రంలో ప్రజల మద్దతు సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డికే ఉందని వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ కో ఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు అన్నారు. మండలంలోని భద్రవరంలో శనివారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. పార్టీ నాయకులతో కలిసి ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గత నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా వరుపుల మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో సీఎం జగన్‌కు పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. సీఎం జగన్ పాలనలో ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలు అందాయన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు కొనసాగాలంటే సీఎం జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలన్నారు. తొలుత గ్రామంలో పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ నేతలు శిడగం వెంకటేశ్వరరావు, అలమండ చలమయ్య, సుంకర రాంబాబు, తొండారపు రాంబాబు, కూనపురెడ్డి సుబ్బారావు, దుర్గారావు, కాశపు వీరబాబు, ఉగ్గిన రాజు పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యంపై కేసు

కిర్లంపూడి: యువకుడు అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు స్థానిక ఇన్‌చార్జి ఎస్సై ఎస్.రామలింగేశ్వరరావు శనివారం తెలిపారు. వివరాల్లోకి వెళితే... మండలంలోని బూరుగుపూడి గ్రామానికి చెందిన జోకా ధర్మరాజు కుమారుడు జోకా అమరనాథ్‌స్వామి జగ్గంపేటలోని ఎయిర్‌టెల్ కంపెనీలో సిమ్ కార్డుల సేల్స్ ఏజెంట్‌గా పనిచేస్తున్నాడు. అమరనాథ్‌స్వామి ప్రతిరోజూ ఇంటికి ఆలస్యంగా రావడంతో తల్లి మందలించింది. దీంతో ఈ నెల 20న ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆ యువకుడు తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు, స్నేహితులు పరిసర ప్రాంతాలు, బంధువుల ఇంటి వద్ద గాలించినా ఆచూకీ తెలియకపోవడంతో యువకుడి తండ్రి ధర్మరాజు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై రామలింగేశ్వరరావు తెలిపారు.

సామాన్యులు అసెంబ్లీలో అడుగుపెట్టడానికి సరిపోరా..?



పెంటపల్లి వద్ద పాఠంశెట్టి సూర్యచంద్రతో మాట్లాడుతున్న పోలీసులు

జనసేన జగ్గంపేట ఇన్‌చార్జి పాఠంశెట్టి సూర్యచంద్ర ఆవేదన

గోకవరం: తనలాంటి సామాన్యులు అసెంబ్లీలోకి అడుగుపెట్టడానికి సరిపోరా అంటూ జనసేన జగ్గంపేట ఇన్‌చార్జి పాఠంశెట్టి సూర్యచంద్ర ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం టీడీపీ, జనసేన సంయుక్తంగా పలు నియోజకవర్గాల ఎమ్మెల్యే అభ్యర్థుల ప్రకటనలో భాగంగా జగ్గంపేట ఎమ్మెల్యే టిక్కెట్టు టీడీపీకి ప్రకటించారు. ఆ సమయంలో కిర్లంపూడి మండలం గోనేడలో ఉన్న సూర్యచంద్ర గోకవరం మండలం అచ్యుతాపురం వరకూ పాదయాత్ర చేపట్టారు. జగ్గంపేటలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ తన భార్య శ్రీదేవికి సెంటిమెంట్ అయిన అచ్యుతాపురంలోని కనకదుర్గమ్మ ఆలయానికి వెళ్లి తుది శ్వాస తీసుకుంటానని చెప్పారు. దీంతో గోకవరం పోలీసులు అప్రమత్తమై పెంటపల్లిలో పాదయాత్రను అడ్డుకునే ప్రయత్నం చేయగా వారిని దాటుకుని వీరలంకపల్లి వరకూ వచ్చారు. అక్కడ పోలీసులు భారీగా మోహరించడంతో ఉద్రిక్తత ఏర్పడింది. ఈ సందర్భంగా పాఠంశెట్టి సూర్యచంద్ర మాట్లాడుతూ 2019 నుంచి జనసేనలో తిరుగుతూ నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి కృషి చేసిన తనకు టిక్కెట్టు కేటాయించకపోవడం తీవ్ర మనస్తాపానికి గురి చేసిందన్నారు. సామాన్యుడిగా పుట్టి రబ్బరు చెప్పులు వేసుకునే తాను ఎమ్మెల్యే టిక్కెట్టు ఆశించడం తగదేమోనన్నారు. తాను చేసిన తప్పుకు తానే శిక్ష విధించుకుంటున్నానని చెప్పారు. తనలా సామాన్యుడిగా పుట్టి ఎమ్మెల్యే టిక్కెట్టు ఆశించే యువతకు తన జీవితం గుణపాఠం కావాలన్నారు. ఇందుకోసం ఆమరణ నిరాహార దీక్ష చేపడతానన్నారు. అనంతరం అచ్యుతాపురంలో కనకదుర్గమ్మ ఆలయం వద్దకు చేరుకున్నారు.

నవరత్నాలతో పేదల జీవితాల్లో వెలుగులు

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు
- శంఖవరంలో సచివాలయ కన్వీనర్లతో సమావేశం

శంఖవరం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్న పథకాల అమలుతో పేదల జీవితాల్లో వెలుగులు నింపారని వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ కో ఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు అన్నారు. శంఖవరంలో శనివారం ఎంపీపీ పర్వత రాజబాబు అధ్యక్షతన సచివాలయ కన్వీనర్ల సమావేశం నిర్వహించారు. వరుపుల సుబ్బారావు ముఖ్య అతిథిగా హాజరై కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయం కోసం కార్యకర్తలు కష్టించి పని చేయాలన్నారు. ప్రభుత్వం అమలు చేసిన పథకాలు ప్రజలకు వివరించాలన్నారు. ప్రతి కుటుంబానికి సీఎం జగన్ ప్రభుత్వంలో లబ్ధి చేకూరిందన్నారు. గత ప్రభుత్వంలో జన్మభూమి కమిటీలు ప్రజలను దోచుకున్నాయని గుర్తు చేశారు. ప్రస్తుతం సచివాలయ వ్యవస్థ ద్వారా నేరుగా ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ నరాల శ్రీను, సర్పంచులు ఈగల విజయదుర్గ, కూనిశెట్టి మాణిక్యం, ఎంపీటీసీలు దడాల సతీష్, చొప్పా రాంబాబు, చల్లా సత్య ప్రసాద్, సొసైటీ చైర్మన్ పర్వత సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ నాయకులు గింజాల కొండబాబు, దూడల శివ, కొండపల్లి అప్పారావు, యెడ్ల సత్యనారాయణ, గౌతు అర్జుబాబు తదితరులు పాల్గొన్నారు.



లింగంపర్తిలో వరుపుల సుబ్బారావును సత్కరిస్తున్న ప్రత్తిపాడు వైఎస్సార్ సీపీ నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న కో ఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు

'వరుపుల'ను కలిసిన నేతలు

ప్రత్తిపాడు: వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావును స్థానిక నేతలు శనివారం కలిసి సంఘీభావం తెలిపారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం నుంచి నాయకులు ర్యాలీగా లింగంపర్తి తరలివెళ్లారు. వరుపుల సుబ్బారావును పూలమాల, శాలువాతో ఘనంగా సత్కరించారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయానికి శక్తివంచన లేకుండా కృషి చేయాలని వరుపుల వారికి సూచించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గుడాల విజయలక్ష్మి, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శేరు కృష్ణ, డైరెక్టర్ గోళ్ల జయశేఖర్, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ అభివృద్ధి కమిటీ డైరెక్టర్ ఏడిద రెడ్డినాయుడు, ట్రేడ్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు పత్రి రమణ, పార్టీ నాయకులు ఆకుల వీరబాబు, చెలంకూరి రాజబాబు, మోర్త విజయ్, పంచాయతీ పాలకవర్గ సభ్యుడు లవకుశ తదితరులు పాల్గొన్నారు.

ఆసరాతో మహిళల ఆర్థికాభివృద్ధి

- మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి
- తునిలో మహిళలకు ఆసరా చెక్కుల పంపిణీ

తుని: మహిళలు ఆర్థికంగా బలోపేతం కావడానికి వైఎస్సార్ ఆసరా పథకం ఎంతగానో దోహదపడుతుందని మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి అన్నారు. పట్టణంలోని సీతారాంపురంలో శనివారం సాయంత్రం కమిషనర్ వెంకట్రావు అధ్యక్షతన మహిళలకు నాలుగో విడత వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. చైర్‌పర్సన్ సుధారాణి ముఖ్య అతిథిగా పాల్గొని పట్టణంలోని మహిళా సంఘాలకు రూ.5.30 కోట్ల విలువైన నమూనా చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల సమయంలో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వస్తే దశల వారీగా డ్వాక్రా రుణ మాఫీ చేస్తామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీని అమలు చేశారన్నారు. అక్క చెల్లెమ్మల జీవితాల్లో వెలుగులు నింపారన్నారు. చంద్రబాబు రుణమాఫీ చేస్తామని మోసం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్న ప్రభుత్వానికి ప్రజలు మద్దతుగా నిలవాలని కోరారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం తుని నియోజకవర్గం అధ్యక్షుడు ఏలూరి బాలు, పార్టీ తుని పట్టణ శాఖ అధ్యక్షుడు రేలంగి రమణాగౌడ్, గాంధీసత్రం చైర్మన్ అనిశెట్టి సూర్యచక్రరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ పామర్తి మహేష్, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల చైర్మన్ కలిదిండి సత్యనారాయణ రాజు, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.



తునిలో మహిళా సంఘాలకు ఆసరా నమూనా చెక్కును అందజేస్తున్న చైర్‌పర్సన్ సుధారాణి

ఎన్నికలు సజావుగా నిర్వహించాలి

ప్రత్తిపాడు: వచ్చే సార్వత్రిక ఎన్నికలను సజావుగా, పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, నియోజకవర్గ ఎన్నికల ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి ఎ.శ్రీనివాసరావు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మోడల్ కోడ్ కమిటీ (ఎంసీసీ), ఫ్లయింగ్ స్క్వాడ్ టీం (ఎఫ్ఎస్‌టీ), స్టాటిక్ సర్వేలెన్స్ టీం (ఎస్ఎస్‌టీ), వీడియో సర్వే లైన్ టీం (వీఎస్‌టీ), వీడియో వీవింగ్ టీం (వీవీటీ), పోలింగ్ అభ్యర్థుల ఖర్చుల పరిశీలన (అకౌంటింగ్) బృందాలతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎన్నికలను శాంతియుతంగా నిర్వహించడంలో ఆయా బృందాలు చాకచక్యంగా వ్యవహరించాలన్నారు. ఎన్నికల సిబ్బంది విధి, విధానాలపై అవగాహన కల్పించారు. సమావేశంలో ప్రత్తిపాడు, ఏలేశ్వరం, శంఖవరం మండలాల తహసీల్దార్లు ఎస్.నరసింహరావు, వై.రంగారావు, వి.రాజకుమారి, ఏలేశ్వరం నగర పంచాయతీ కమిషనర్ శివప్రసాద్, డిప్యూటీ తహసీల్దార్ (ఎన్నికలు) టి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సెక్టార్ ఆఫీసర్లకు అవగాహన

స్థానిక సబ్ ట్రెజరీ కార్యాలయ ఆవరణలో శనివారం సాయంత్రం సెక్టార్ ఆఫీసర్లు, పోలీస్ సెక్టార్ ఆఫీసర్లు, రూట్ ఆఫీసర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. తహసీల్దార్ ఎస్.నరసింహరావు, అసెంబ్లీ లెవెల్ మాస్టర్ ట్రైనర్లు ఎం.రాజబాబు, చుక్కల లక్ష్మీగణేష్, ఏ.తాతబ్బాయి, ఎస్.రాజేష్ పోలింగ్ విధులు, పోలింగ్ నిర్వహణ, సెక్టోరల్ అధికారుల, రూట్ ఆఫీసర్ల విధి, విధానాలు, బాధ్యతలపై అవగాహన కల్పించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్నికల ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి శ్రీనివాసరావు

కేసుల్లో పట్టుబడిన వాహనాలకు వేలం



ప్రత్తిపాడు సెబ్ కార్యాలయంలో వాహనాలకు వేలం నిర్వహిస్తున్న సిబ్బంది

ప్రత్తిపాడు: స్థానిక స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ-సెబ్) కార్యాలయంలో వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు నిర్వహించిన వేలంలో 91 శాతం అదనపు ఆదాయం లభించింది. స్థానిక ఎస్ఈబీ కార్యాలయంలో ఎస్ఈబీ కాకినాడ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ రవికుమార్ సమక్షంలో శనివారం వివిధ కేసుల్లో పట్టుబడిన 15 మోటారు సైకిళ్లు, రెండు ఆటోలకు బహిరంగ వేలం నిర్వహించారు. ఈ వాహనాలకు రూ.2,09,900 ధర నిర్ణయించగా పాటదారులు అత్యధికంగా రూ.4,00,900 లకు పాడుకుని, వాహనాలను దక్కించుకున్నారు. ఈ వేలంలో స్థానిక ఎస్ఈబీ సీఐ ఎల్. చిరంజీవి, సెబ్ సిబ్బంది, 65 మంది పాటదారులు పాల్గొన్నారు.

గోవు... రక్షణ కరువు

గండేపల్లి: వాహనాల్లో తరలిస్తున్న ఆవులకు రక్షణ కరువైంది. వ్యవసాయ అవసరాలు, ఇతర పనుల నిమిత్తం రక్షణ లేని వాహనాల్లో ఆవులను తరలించడంతో అవి ప్రమాదాల బారిన పడుతున్నాయి. కాగా శనివారం జగ్గంపేట మండలం మల్లిపాక నుంచి నూజివీడుకు ఆవులను బొలేరో వ్యాన్‌లో తరలిస్తుండగా గండేపల్లి మండలం తాళ్లూరు శివారులో హనీ దాబా వద్దకు వచ్చేసరికి వ్యాన్లో ఉన్న ఒక ఆవు అమాంతం రోడ్డుపైకి దూకేసింది. దీంతో ఆవుకు తీవ్ర గాయాలు కాగా అపస్మారకస్థితికి చేరుకుంది. ఇది చూసిన ప్రయాణికులు, జంతు ప్రేమికులు అల్లాడిపోయారు. కొన్ని గంటల తరువాత వాటిని తరలిస్తున్న యజమానులు వచ్చి ఆ ఆవును తీసుకువెళ్లిపోయారు. పశువులను రవాణా చేస్తున్న వాహనదారులు నిబంధనలు పాటించకపోవడంతో తరచూ ఇటువంటి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. చిన్నచిన్న వాహనాల్లో పరిమితికి మించి పశువులను తరలిస్తుండటం, వాటికి సరైన సౌకర్యాలు కల్పించకపోవడంతో మూగజీవాలు గాయాలపాలవుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నిబంధనలకు విరుద్ధంగా పశువులను తరలించేవారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



రోడ్డుపై గాయాలతో అపస్మారక స్థితిలో ఉన్న ఆవు

వెంకన్న ఆలయానికి భక్తుల తాకిడి

గండేపల్లి: మండలంలోని తాళ్లూరులో వేంచేసిన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి దర్శనానికి శనివారం భక్తులు పోటెత్తారు. ఆలయ పండితులు స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఘనంగా లలితా జయంతి

తాళ్లూరు రామలింగేశ్వరస్వామి ఆలయంలో శనివారం లలితా జయంతి వేడుకలు నిర్వహించారు. మాఘపౌర్ణమిని పురస్కరించుకుని పండితులు బాలాత్రిపుర సుందరి అమ్మవారికి ప్రత్యేక పూజలు, లలితాసహస్రనామ పారాయణ చేశారు.